క్లుప్తంగా

ఘనంగా గోదాదేవి క్షేత్రోత్సవం



పెంచలకోనలో గోదాదేవి ఊరేగింపు

రాపూరు: మండలంలోని పెంచలకోనలో శుక్రవారం గోదాదేవికి ప్రత్యేక పూజలు, క్షేత్రోత్సవం నిర్వహించారు. ధనుర్మాసం మొదటి శుక్రవారం గోదాదేవి ఉత్సవ విగ్రహాన్ని తిరుచ్చిపై కొలువు తీర్చి, మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ కోనమాడ వీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు. ఉదయం 5 గంటలకు లక్ష్మీనరసింహస్వామివారికి తిరుప్పావై, ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఉభయకర్తలుగా మధుస్వామి, సువర్ణలక్ష్మి వ్యవహరించారు.

దివ్యాంగులకు తోడ్పాటు అభినందనీయం



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎంఈఓ రవూఫ్

చిల్లకూరు: దివ్యాంగ పిల్లలకు తోడ్పాటు ఇవ్వడం అభినందనీయమని ఎంఈఓ–2 రవూఫ్ తెలిపారు. చిల్లకూరులోని భవిత కేంద్రంలోని ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు శుక్రవారం గ్రామానికి చెందిన పీపుల్స్ వెల్ఫేర్ అండ్ చైల్డ్ ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో చిన్నారులు దుప్పట్లు అందజేశారు. భవిత ఉపాధ్యాయులు బీ నాగరాజు, లలిత, సంస్థ ప్రతినిధులు అరుణ్‌బాబు, విజయమ్మ పాల్గొన్నారు.

ముగిసిన మేట్ల శిక్షణ

చిల్లకూరు: ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. మండలంలోని 13 పంచాయతీల్లో ఉపాధి పనులు నిర్వహించే మేట్లకు శిక్షణ ఇచ్చిన ఉపాధి ఏపీఓ గిరి బాబు మాట్లాడుతూ ప్రతి పనికి మేట్లు కొలతలు తీయాల్సి ఉంటుందని దీనిలో ఏవైనా మార్పులు జరిగితే నష్ట పోయేది కూలీలేనని అన్నారు. ఎప్పటికప్పుడు కూలీలు చేసిన పని కొలతలు తీసి, రికార్డు చేస్తే ఏడాది చివరిలో వచ్చే ఆడిట్ బృందాలు కూడా ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆడిట్ చేయడం సులువు అవుతుందన్నారు.

బాలికకు ఆర్థిక సహాయం

సూళ్లూరుపేట రూరల్: జాతీయ స్థాయిలో అథెటిక్స్‌కు ఎంపికైన ఆబాక గ్రామానికి చెందిన క్రీడాకారిణి విజయశాంభవికి పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థులు రూ. 25వేలు ఆర్థిక సహాయం అందజేశారు. స్థానిక జూనియర్ కళాశాలలో ఈ నగదును అందజేశామని పూర్వ విద్యార్థుల సంఘం కమిటీ సభ్యులు ఎల్. శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ధనుంజయ రెడ్డి, సంతోష్, శ్రీనివాస్, ఉస్మాన్‌బాషా, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ నీలిమ పాల్గొన్నారు.

మెట్టపైర్లు సాగు చేసుకోవాలి

కలువాయి: సోమశిల జలాశయం పరిధిలోని దక్షిణ కాలువ కింద వరి సాగు చేసుకునే వీలు లేనందున మెట్టపైర్లు మాత్రమే సాగు చేసుకోవాలని ఏఓ ప్రతాప్ అన్నారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో వ్యవసాయ సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని కుల్లూరు, మాదన్నగారిపల్లె, బ్రాహ్మణపల్లె, బద్దెవోలు, కలువాయి, నూకనపల్లె, తెలుగురాయపురం, తోపుగుంట, అగ్రహారం వరకు మాత్రమే నీటి పంపిణీ జరుగుతుందన్నారు. ఏఈలు పి.వినయ్ కుమార్, వి.మహేశ్వరరావు మాట్లాడుతూ దక్షిణ కాలువకు ఒక టీఎంసీ నీటిని విడుదల చేస్తారని, వీటితో కాలువ 5 ఎల్ డిస్ట్రిబ్యూటరీ వరకు నీటి పంపిణీ జరుగుతుందన్నారు.

బీమా నగదు అందజేత

వెంకటగిరిరూరల్: పట్టణంలోని 20వార్డు మాసాపేటకు చెందిన ఎస్‌కే మములు కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా నగదును అధికారులు, నేతలు శుక్రవారం అందజేశారు. మములు అనారోగ్యంతో మృతి చెందారు. మృతురాలు అంత్య క్రియలకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణ సాయం కింద మృతురాలి కుటుంబానికి రూ. 10వేలు నగదు మంజూరు చేసింది. ఆ మొత్తాన్ని వెల్ఫేర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, వైఎస్సార్‌సీపీ నేత సతీష్‌కుమార్ అందజేశారు. నేతలు సయ్యద్, అబూకర్, శోభన, మస్తాన్ నిక్సన్ పాల్గొన్నారు.

ఏకాదశికి కోన ముస్తాబు



రాపూరు: మండలంలోని పెంచలకోనలో శనివారం నిర్వహించనున్న వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. శ్రీవారి నిత్యకల్యాణ మండపంలో బంగారు కాంతులతో ఉట్టిపడేలా ద్వారాలు ఏర్పాటు చేశారు. బంగారు గరుడువాహనంపై శ్రీవారిని కొలువు దీర్చి తెల్లవారు జామున స్వామివారి దర్శనానికి అనుమతిస్తామని అధికారులు తెలిపారు.

బంగారు గొలుసు చోరీ

నాయుడుపేట: మున్సిపాలిటీలోని అమరా గార్డెన్ వీధిలో కే మహేశ్వమ్మ మెడలో బంగారు గొలుసును శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేశాడు. ఇంటి ముందు ముగ్గు వేస్తున్న మహేశ్వరమ్మ మెడలోని గొలుసు లాక్కుని పరుగులు తీశాడు. దుండగుని పట్టుకునేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. బాధితురాలకు ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసింది.

దేశం గర్వించదగ్గ మేధావి రామానుజన్



కోట: నివాళులర్పిస్తున్న ఎన్బీకేఆర్ అధ్యాపకులు



చిట్టమూరు: మాట్లాడుతున్న హెచ్‌ఎం జ్యోతి

చిట్టమూరు: గణితశాస్త్ర పితామహుడు శ్రీనివాసరామానుజన్ దేశం గర్వించదగ్గ మేధావని ఆరూరు జెడ్పీ హైస్కూలు ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి పేర్కొన్నారు. శుక్రవారం పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ అపార ప్రతిభా పాటవాలతో గణిత శాస్త్రంలో పలు కొత్త సిద్ధాంతాలను కనిపెట్టారన్నారు. 20వ శతాబ్ధంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన గణిత మేధావుల్లో ఒకరుగా పేరు సంపాదించిన భారతీయుడు శ్రీనివాస రామానుజన్ అన్నారు. అనంతరం విద్యార్థులకు గణితంలో క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, చలపతి, మీరయ్య, పుష్పలత, అశోక్, గౌస్‌బాషా, పాల్గొన్నారు.

శ్రీనివాస రామానుజన్ ఆదర్శం

కోట: విద్యానగర్ ఎన్బీకేఆర్ ఐఎస్టీలో శుక్రవారం జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రామానుజన్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, సీ రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

గణిత మేధావికి నివాళి

చిల్లకూరు: గణిత శాస్త్రంలో ఎన్నో ప్రయోగాలు చేసిన శ్రీనివాసరామానుజానికి మండలంలోని పలు ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలలో శుక్రవారం నివాళులర్పించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో హెచ్‌ఎంలు మాట్లాడుతూ గణిత మేధావి రామానుజం గణిత వాస్త్రంలో ఎన్నో ప్రయోగాలు చేశారని తెలిపారు. చింతవరంలోని రేస్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు శ్రీనివాస రామానుజానికి ఎంతో ఇష్టమైన 1729 అంకెతో ఆయనకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బాలచెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

విందూరులో..

గూడూరురూరల్: విందూరులోని జూనియర్ కళాశాల, హైస్కూల్‌లో గణిత దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. గణిత మేధావి శ్రీనివాస రామానుజం జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు చిత్ర లేఖనం, వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. జెడ్పీ హెచ్‌ఎం బాలాజీ మాట్లాడుతూ గణిత మేధావి శ్రీనివాస రామానుజం గణితంలో ఎన్నో ప్రయోగాలు చేసి నేడు ప్రపంచ ఆర్థిక స్థితిగతులకు కారణం అయ్యారన్నారు. నేడు ప్రతి ఆర్థికవేత్త గణిత మేధావి అందించిన సేవలను గుర్తు చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిరుపాల్ దయాకర్, పాల్గొన్నారు.

పాఠశాలల్లో..

పెళ్లకూరు: మండలంలోని పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని జాతీయ గణిత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. నెలబల్లి, తాళ్వాయిపాడు, పెళ్లకూరు, పాలచ్చూరు, చెంబేడు, రోసనూరు, శిరసనంబేడు గ్రామాల్లోని జెడ్పీ హైస్కూళ్లలో ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి రామానుజన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 6 నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు గణితంలో క్విజ్‌పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు దొరస్వామి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

చీపినాపి జెడ్పీ హైస్కూలులో..

కలువాయి: మండలంలోని చీపినాపి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీనివాస రామానుజం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రామానుజన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జనార్దనరెడ్డి పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో..

సూళ్లూరుపేట రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం గణిత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్స్‌పల్ ఎస్ఎల్‌బీ శర్మ, డాక్టర్ విక్టోరియా రాణి, డాక్టర్ రాజా, డాక్టర్ వరప్రసాద్ శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



చిల్లకూరు: 1729 ఆకారంలో విద్యార్థుల మానవహారం



పెళ్లకూరు: తాళ్వాయిపాడు జెడ్పీ హైస్కూలులో గణిత దినోత్సవ వేడుకలు



కలువాయి: గణిత దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పేదలకు దుస్తుల పంపిణీ



దుస్తులు అందజేస్తున్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు

చిల్లకూరు: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని నల్లాయగారిపాళెంలోని బిలీవర్స్ చర్చిలో శుక్రవారం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ముందస్తు క్రిస్మస్ వేడుకలను నిర్వహించి, సంఘ కాపరి ఏసుపాదం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం కేక్ కట్ చేసి పంచి పెట్టారు. అనంతరం గూడూరుకు చెందిన బాస్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు, గూడూరు డివిజన్ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు రవీంద్రబాబు చేతుల మీదుగా పేదలుకు దుస్తులు అందజేశారు. సంస్థ సభ్యులు బాబు, దిలీప్, వరమ్మ, ఎస్తేరు, రూతమ్మ పాల్గొన్నారు.

నేడు ఉత్తర ద్వార దర్శనం

దక్కిలి: ఆదిలక్ష్మీసమేత యోగలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శనివారం భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించనున్నట్లు ఆలయ నిర్వాహకులు విజయ్‌కుమార్, సుబ్బారావు తెలిపారు. ఉదయం 5 గంటలకు ఉత్తర ద్వార దర్శనం, 8 గంటలకు ప్రత్యేక పూజలు, 10 గంటలకు భజనలు, 12 గంటలకు అన్నదానం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

భద్రతా వైఫల్యంతోనే పార్లమెంట్‌పై దాడి

గూడూరురూరల్: పార్లమెంట్‌పై దాడి భద్రతా వైఫల్యంతోనే జరిగిందని అఖిల పక్షం నాయకులు దుయ్యబట్టారు. పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం అఖిల పక్ష నాయకులు నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం నాయకులు బాలసుబ్రహ్మణ్యం, జే శివకుమార్, బీవీ రమణయ్య, ఎస్ సురేష్, ఏ ప్రసాద్, చంద్రయ్య, గోపినాథ్, రమణయ్య, సీపీఐ నాయకులు సీహెచ్ ప్రభాకర్, ఎస్‌కే కాలేషా, శశికుమార్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆర్థిక సాయం అందజేత



చిల్లకూరు: బాధితులకు నగదు అందస్తున్న నాయకులు, రెవెన్యూ సిబ్బంది



కోటలో తుపాను బాధితులకు సాయం అందజేస్తున్న సర్పంచ్ వెంకటరమణమ్మ, మొబీన్

చిల్లకూరు: తుపాను ఇల్లు కూలిపోయిన 9 మంది బాధితులకు ప్రభుత్వం శుక్రవారం ఆర్థిక సాయం అందజేసినట్లు రెవెన్యూ సిబ్బంది తెలిపారు. మండలంలోని తిప్పగుంటపాళెం, చేడిమాల గ్రామాల్లోని బాధితులకు నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీఆర్వో గాయత్రి మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి కుటుంబానికి బియ్యం, నగదు పంపిణీ చేశామన్నారు. వరద నీరు ఇళ్లలోకి వచ్చి తిప్పగుంటపాళెంలో ఐదు పూరిళ్లు కూలి పోగా వారి వివరాలను నమోదు చేసుకున్న రెవెన్యూ అధికారులు బాధితులకు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత సనత్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా నగదు అందజేశారు. అలాగే చేడిమాలలో నాలుగు కుటుంబాల వారికి కూడా నగదును అందించినట్లు తెలిపారు.

కోటలో..

కోట: వర్షాలకు ఇళ్లు కూలిపోయిన బాధితులకు ప్రభుత్వ సాయం అందజేశారు. కోట మేజర్ పంచాయితీ పరిధిలోని కోటమ్మగుడి కాలనీ, నార్త్ గిరిజన కాలనీలో శుక్రవారం 19 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు వంతున సర్పంచ్ వెంకటరమణమ్మ, ఎంపీటీసీ సభ్యుడు మొబీన్ చేతులు మీదుగా నగదు అందజేశారు.

సమస్యలు పరిష్కరించాలి

వాకాడు: అధికారులు తమ పరిధిలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని, అప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని ఆర్డీఓ కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఏఎంసీ ఆవరణలో జగనన్నకు చెబుతాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో అధికారులు కష్టపడి పనిచేయాలన్నారు. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం పలు రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. వాటిని అర్హులకు అందేలా చూడాలన్నారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వాకాడు పీఏసీఎస్ అధ్యక్షుడు భక్తవత్సలరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ, అజిత్‌రెడ్డి, తహసీల్దార్ నరసింహరావు, ఎంపీడీఓ గోపీనాథ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నాయుడుపేట: కలకత్తా–చెన్నై జాతీయ రహదారి, నాయుడుపేట సమీపంలోని బిరదవాడ క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. వివరాలు.. విన్నమాల గ్రామానికి చెందిన నాగరాజు (45) బైక్‌లో శ్రీనివాసపురం వెళుతుండగా మార్గం మధ్యంలో బిరదవాడ క్రాస్ వద్ద నెల్లూరు నుంచి చెన్నై వెళుతున్న కారు అతివేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో నాగరాజు అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. కారు బైక్‌ను ఈడ్చుకెళ్లడంతో మంటలు చెలరేగాయి. బైక్ పూర్తిగా కాలిపోయింది. నాయుడుపేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి బంధువులకు అప్పగించారు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు.

ఆరోగ్యశ్రీకార్డుల పంపిణీ



ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేస్తున్న శ్రీనివాసులురెడ్డి

వెంకటగిరిరూరల్: మండలంలోని పాలగొండ సత్రంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కే శ్రీనివాసులురెడ్డి లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్యం అందించాలన్న ఉద్దేశంతో ఆరోగ్యశ్రీ పరిధిని రూ. 25 లక్షలు వరకు పెంచుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత టీ శివారెడ్డి, సర్పంచ్ చెంచులక్ష్మి, నాయకులు రాజేంద్ర, కుమార్, ఎంపీడీఓ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కలువాయిలో అగ్ని ప్రమాదం

కలువాయి: మండల కేంద్రంలోని ఉపాధ్యాయుడు జీవీ మురళీకృష్ణ ఇంట్లో శుక్రవారం అగ్రిప్రమాదం సంభవించింది. దేవుని గదిలో వెలిగించిన దీపం నుంచి మంటలు వ్యాపించడంతో ప్రమాదం సంభవించినట్లు చెబుతున్నారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఇంట్లోని వస్తువులన్నీ కాలిపోయాయి. ఏసీ, టీవీ, దుస్తులు, పుస్తకాలు, ఇతర విలువైన వస్తువులు కాలి బూడిదయ్యాయి. చుట్టుపక్కల వారు గమనించి మంటలను అదుపుచేశారు.

గురుకులంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు



నాయుడుపేట: స్థానిక అంబేడ్కర్ బాలుర గురుకుల కళాశాలలో శుక్రవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురుకుల విద్యా సంస్థల జిల్లా కోఆర్డినేటర్ జయభారతి కేక్ కట్ చేసి చిన్నారులకు పంచి పెట్టారు. ఈ సందర్భంగా జిల్లా కోఆర్డినేటర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు పండుగల సంస్కృతి సంప్రదాయాలను తెలుసుకోవాలన్నారు. గడిచిన కాలంలో విద్యార్థులు పాఠ్యంశాలపై దృష్టి పెట్టడమే కాకుండా మళ్లీ, మళ్లీ నెమరువేసుకుంటూ ముందుకు వెళ్లాలన్నారు. విద్యతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. ప్రిన్సిపల్ మల్లికార్జున్‌రావు, ఉపాధ్యాయులు బీ శేఖర్, వెంకటకృష్ణయ్య, అరుణ, నాగేశ్వరావు, మోహన్‌రావు, రమణయ్య, నారాయణరాజు, ప్రసన్న, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరిలో సినీ నటి అనసూయ సందడి



వెంకటగిరిలో అభిమానులనుద్దేశించి మాట్లాడుతున్న సినీ నటి అనసూయ(ఇన్‌సెట్) షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అనసూయ

వెంకటగిరి రూరల్: పట్టణంలో సినీ నటి, ప్రముఖ యాంకర్ అనసూయ శుక్రవారం సందడి చేశారు. స్థానిక రాజావీధిలోని శ్రీ బాలాజీ షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవానికి ఆమె విచ్చేశారు. తొలుత అనసూయ రిబ్బన్ కట్‌చేసి, ప్రత్యేక పూజలు అనంతరం షాపింగ్ మాల్‌ను ప్రారంభించారు. వెంకటగిరి జరీచీరలు, పట్టుచీరలను పరిశీలించారు. శుభమస్తు షాపింగ్‌మాల్ అధినేత వయ్యా రవికుమార్ అనసూయకు చీరలు, వాటి ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తనకు వెంకటగిరి జరీచీరలంటే ఎంతో ఇష్టమన్నారు. ఇదిలావుండగా తమ అభిమాన నటి, యాంకర్‌ను చూసేందుకు యువత ఆసక్తి చూపారు. ఆమెతో కలిసి సెల్ఫీలు దిగేందుకు పోటీ పట్టారు. కార్యక్రమంలో శ్రీ బాలాజీ షాపింగ్ మాల్ నిర్వాహకులు రామ్మోహన్, బాలాజీ, బాలకృష్ణ, వెంకటేశ్వర్లు, మల్లిక దంపతులు, నెల్లూరు జిల్లా గ్రంథాలయసంస్థ చైర్‌పర్సన్ దొంతుశారద, బాలకృష్ణ, పట్టణ కన్వీనర్ జీ.ఢిల్లీబాబు పాల్గొన్నారు.

అనసూయాకు ఫొటో బహూకరణ

వెంకటగిరికి చెందిన ప్రముఖ పెన్సిల్ ఆర్ట్ కళాకారుడు పోలిశెట్టి శంకర్ సినీ నటి అనసూయకు తాను స్వయంగా పెన్సిల్‌తో గీసిన అనసూయ చిత్రం ఫొటోను శుక్రవారం వెంకటగిరిలోని బాలాజీ వస్త్రాలయంలో సినీ నటి అనసూయాకు బహూకరించారు.

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు 2 నమూనాల ఎంపిక



రిత్విక్‌కు ధ్రువపత్రం అందజేస్తున్న హెచ్‌ఎం

ఓజిలి: మండలంలోని చిలమానుచేను ఉన్నత పాఠశాలకు చెందిన రెండు వైజ్ఞానిక సైన్స్ ప్రదర్శనలు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం అనూసుయ శుక్రవారం తెలిపారు. ఈ నెల 19వ తేదీన ఓజిలి ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో మొబైల్ టెక్నాలజీ ద్వారా ఇన్నోవేటివ్, కెమిస్ట్రీని సులువుగా ఎలా అర్థం చేసుకోవాలి అన్న అంశంపై రెండు నమూనాలు జిల్లాస్థాయికి ఎంపికయ్యాయన్నారు. శ్రీకాళహస్తి జెడ్పీ బాలుర పాఠశాలలో నిర్వహించిన జిల్లాస్థాయిలో సైన్స్‌ఫేర్‌లో ఉత్తమ ప్రదర్శనగా నిలిచి, రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయని చెప్పారు. రాష్ట్రస్థాయిలో ఈ నెల 28, 29 తేదీల్లో కడప సెంట్‌జోసెఫ్ పాఠశాలలో జరగనున్న వైజ్ఞానిక మేళాలో ఈ నమూనాలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. దీంతో చిలమానుచేను ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉపాధ్యాయు లు జే శ్రీనివాసులు, విద్యార్థి పార్థు, రిత్విక్‌ను హెచ్‌ఎం అభినందించారు. రాష్ట్రస్థాయి సైన్స్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికు ఎంపిక కావాలని ఆకాంక్షించారు.

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక మేళాకు మాంబట్టు విద్యార్థినుల నమూనాలు

తడ: రాష్ట్రస్థాయి విద్య వైజ్ఞానిక ప్రదర్శనకు చిన్నమాంబట్టు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు తయారు చేసిన నమూనాలు ఎంపికయ్యాయి. శ్రీకాళహస్తి జెడ్పీ బాలుర పాఠశాలలో నిర్వహించిన జిల్లాస్థాయిలో సైన్స్‌ఫేర్‌లో విద్యార్థినులు ఎం శ్రావ్య, ఎన్ వర్షిత తయారు చేసిన 'రహదారులపై ప్రమాద నివారణ' అనే సైన్స్ ప్రాజెక్టు రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. వీరికి డీఈఓ శేఖర్ ప్రశంసా పత్రం అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం ఫణివేణి పాల్గొన్నారు.

ఐఐటీ సదస్సులో ఎన్బీకేఆర్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఎన్బీకేఆర్ ఐఎస్టీ డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి

కోట: విద్యానగర్ ఎన్బీకేఆర్ ఐఎస్టీ విద్యార్థులు ఐఐటీ సదస్సులో పాల్గొని, ప్రతిభ కనబరిచినట్లు కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కళాశాలలో విద్యార్థులను అభినందించారు. ఐఐటీ వారణాసిలో ఇటీవల ఏఐఎంటీడీఆర్ అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సు లో మెకానికల్ విభాగం తృతీయ సంవత్సరం విద్యార్థులు కె.సంతోష్ కుమార్, ఎస్.ధనుష్, కె.సురేష్ పాల్గొని ఇన్వెస్టిగేషన్ ఆన్ మెకానికల్ అండ్ మెటలర్జికల్ ప్రాపర్టీస్ ఆఫ్ కాపర్‌కోటెడ్ అనే అంశంపై పరిశోధన పత్రాలు ప్రజెంటేషన్ చేసినట్లు తెలిపారు. అలాగే ఇటీవల ఐఐటీ చెన్నైలో జరిగిన అంతర్జాతీయ సదస్సులో మెకానికల్ ఫైనలియర్ విద్యార్థులు హర్షద్, జన్నత్‌హుసేన్ పాల్గొని మిషన్‌విజన్, సర్ఫేస్ టెక్చర్ అనే అంశాలపై పరిశోధన పత్రాలను సమర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెకానికల్ విభాగం హెచ్‌ఓడీ విక్రమ్‌కుమార్ పాల్గొన్నారు.

కార్పొరేటుకు దీటుగా ప్రభుత్వ విద్య



ఓజిలి: ట్యాబ్‌లతో విద్యార్థులు, జెడ్పీటీసీ సభ్యుడు

ఓజిలి: రాష్ట్రంలో కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాప్రమాణాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని జెడ్పీటీసీ సభ్యుడు రవీంద్రరాజు అన్నారు. మండలంలోని ఆర్మేనిపాడు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ట్యాబ్‌లను శుక్రవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. చిన్నతనం నుంచి క్రమశిక్షణ అలవరుచుకుని ప్రయోజకులు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు రఘురామరాజు, సర్పంచ్ పోలయ్య, నాయకులు కే వెంకటసుబ్బరాజు, సుకుమార్‌రాజు, హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్ రమేష్, ఉపాధ్యాయులు నాగమణి, సర్దార్, నరసింహులు, చంద్రబోస్, మనోజ్ సంజీవ్, పోలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ట్యాబ్‌లతో విద్యార్థులకు ఉపయోగకరం

పెళ్లకూరు: రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న బైజూస్ యాప్‌తో కూడిన ట్యాబ్‌లు విద్యార్థులకు చాలా ఉపయోగకరమని హెచ్‌ఎం దొరస్వామి అన్నారు. శుక్రవారం స్థానిక జెడ్పీ ఉన్న పాఠశాలలోని ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిషు మీడియంతో పాటు సీబీఎస్‌సీ సిలబస్ ప్రవేశ పెట్టడంతో నాణ్యమైన విద్య అందుతుందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వీరకుమార్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కరుణాకర్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతి

దొరవారిసత్రం: జాతీయ రహదారిపై రాంగ్ రూట్‌లో మోటారు సైకిల్‌పై వస్తున్న పీ రమణయ్య(60)ను ఎదురుగా వచ్చే గుర్తుతెలియని వాహన ఢీ కొనడంతో అక్కడిక్కడే మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి వేణుంబాకం రోడ్డు సమీపంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. పాళెంపాడు గ్రామానికి చెందిన రమణయ్య రోజు లాగే నాయుడుపేట పట్టణంలో తాపీ పనికి వెళ్లి ఇంటికి తిరిగి వచ్చే క్రమంలో జాతీయ రహదారిపై రాంగ్ రూట్‌లో వస్తున్న సమయంలో ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో రమణయ్య తీవ్రంగా గాయపడి ఘటన స్థలంలోని మృతి చెందాడు. మృతుడికి భార్య పిల్లలు ఉన్నారు. స్థానిక పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'స్వర్ణముఖి'లో గుర్తుతెలియని మృతదేహం

పెళ్లకూరు: మండలంలోని చిల్లకూరు వడ్డిపాళెం గ్రామం వద్ద స్వర్ణముఖినదీ తీరంలో శుక్రవారం గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ శ్రీకాంత్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహం బాగా ఉబ్బి గుర్తు పట్టలేని విధంగా ఉందని చెప్పారు. గీతల టీషర్ట్, నలుపు డ్రాయర్‌తో ఉన్నట్లు పేర్కొన్నారు. స్థానిక వీఆర్వో వంశీ ఆధ్వర్యంలో పంచనామా నిర్వహించి అనంతరం ఖననం చేయించారు. కేసు దర్యాప్తులో ఉంది.

క్రీడా పోటీలను జయప్రదం చేయండి



దక్కిలి: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాజశేఖర్

దక్కిలి: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26వ తేదీ నుంచి నిర్వహించనున్న ఆడుదాం..ఆంధ్ర క్రీడా పోటీలను జయప్రదం చేయాలని ఎంపీపీ జీ రాజశేఖర్, జేసీఎస్ మండల ఇన్‌చార్జి సీహెచ్ శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో క్రీడా పోటీల నిర్వహణపై పంచాయతీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులుతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలపై యువతీ యువకుల్లో ప్రతిభ వెలికితీతకే ఆడుదాం..ఆంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. ఎంపీడీఓ ప్రసన్నకుమారి, ఎంఈఓలు వెంకటేశ్వర్లు, జగదీష్‌బాబు, డీటీ హరికృష్ణ పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

కోట: ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలను విజయవంతంగా నిర్వహించాలని డీఎల్‌డీఓ వాణి సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో క్రీడాపోటీల సన్నద్ధతపై అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. క్రీడల కోసం మైదానాలను పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలన్నారు. క్రీడాకారులే కాకుండా 15 ఏళ్ల పైబడిన ఆసక్తి గల వారు ఎవరైన ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. కోట మండలంలో పురుషులు 2,327 మంది, మహిళలు 1,277 మంది తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు తెలిపారు. ఎంపీడీఓ భవానీ, ఎంఈఓ మస్తానయ్య పాల్గొన్నారు.